www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 డిసెంబర్ 2024
5
ఏలూరు



జిల్లాలో నేడు
ఎస్‌సి వర్గీకరణ ఏకసభ్య కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ సామాజిక తరగతిలోని ఉప-వర్గీకరణపై విచారణ చేయడానికి నియమించిన ఏకసభ్య కమిషన్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 27వ తేదీ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశపు హాలులో జిల్లా యంత్రాంగం, వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. ఏకసభ్య కమిషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని షెడ్యూల్ తరగతులకు సంబంధించి, వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి మెమోరాండం, వినతిపత్రాలను స్వీకరించి పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తారని తెలిపారు.

ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం


పుస్తకావిష్కరణ సభలో వక్తలు
గొప్ప నిష్కలంక దేశభక్తుడు రామం
సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
మతోన్మాద శక్తులపై పోరాటాలే రామంకు నిజమైన నివాళి
సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీ




పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబీ

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామీణ ప్రాంతం నుండి ఉద్యమ నేతగా ఎదిగిన ఉద్దరాజు రామం ఉద్యమాల శిఖరం అని పలువురు అభివర్ణించారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ, సిపిఎం నేత ఉద్దరాజు రామం జీవన యానంపై ప్రచురించిన పుస్తకాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఆవిష్కరించారు. స్థానిక అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగిన పుస్తకావిష్కరణ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఉద్దరాజు రామం గొప్ప నిష్కలంక దేశభక్తుడని అన్నారు. అత్యంత సామాన్య జీవితాన్ని గడిపిన తొలి తరం కమ్యూనిస్టు రామం అని తెలిపారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర పోరాటంలో అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించారన్నారు. దేశ స్వాతంత్రం కోసం అనేక కష్టాలను ఆయన భరించారన్నారు. అనేక సంవత్సరాలు జైలులో నిర్బంధించినా ఆయన పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించారన్నారు. రైతులను, సామాన్య ప్రజానీకాన్ని అనేక పోరాటాల వైపు నడిపించారని తెలిపారు. కుల వివక్షకు వ్యతిరేకంగా సుందరయ్యతో కలిసి ఉద్దరాజు రామం గొప్ప పోరాటం చేశారన్నారు. పలు సంఘ సంస్కరణ కార్యక్రమాలు చేపట్టిన రామం అందరికీ ఆదర్శప్రాయుడయ్యారని తెలిపారు. ప్రస్తుతం మత వివక్ష దేశంలో పెరుగుతోందని, మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాలను విభజిస్తూ ప్రజలను వేరు చేస్తున్నారని తెలిపారు. ఈ పోకడలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ఇతర అనేక శక్తులు పోరాటం జరిపాయని గుర్తు చేశారు. ఆ పోరాటంలో వీరోచితంగా పాల్గొన్న నాయకుడు ఉద్దరాజు రామం అని కొనియాడారు. 1957 నుండి 1962 వరకూ పార్లమెంట్ సభ్యునిగా పని చేసిన రామం చట్టసభలో చాలా చురుకైన పాత్ర పోషించారన్నారు. అటువంటి చారిత్రక సమయంలో కేరళ రాష్ట్రంలో ఇఎంఎస్.నంబూద్రిపాద్ నాయకత్వాన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. అయితే ఆ ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య విరుద్ధంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. ఆ సమయంలో ఉద్దరాజు రామం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిలదీశారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, మతోన్మాద ఫాసిస్టు శక్తులు దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న దేశభక్తుల ఆశయాలకు తూట్లు పొడుస్తున్నాయని తెలిపారు. ఈ శక్తులకు వ్యతిరేకంగా రామం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని విశాల వేదికను ఏర్పాటు చేసి పోరాటం కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ.గఫూర్, మంతెన సీతారాం, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ, ప్రముఖులు డివిఎస్.వర్మ, సీనియర్ జర్నలిస్టు ఎం.కోటేశ్వరరావు, రామం తనయుడు ఉద్దరాజు బాపిరాజు, మనవరాలు శారద తదితరులు మాట్లాడారు. పుస్తక రచనలో పాలుపంచుకున్న యు.రామకృష్ణ, భానుప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత వక్తలను కవురు పెద్దిరాజు వేదికపైకి ఆహ్వానించగా చింతకాయల బాబూరావు వందన సమర్పణ చేశారు.



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

'పెసా' గ్రామసభల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

అధికారిక ప్రకటన జారీ చేసిన జెసి ధాత్రిరెడ్డి
ఏడు నుంచి పదో తేదీ వరకూ 175 పెసా గ్రామసభలకు ఎన్నికలు
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) కోటరామచంద్రపురం ఆధ్వర్యంలో ఉన్న ఐదు షెడ్యూల్ ఏరియా మండలాలు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడులో 175 పెసా గ్రామసభ ఎన్నికలు నిర్వహించడానికి జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి గురువారం అధికారిక ప్రకటనకు ఆమోద ముద్ర వేశారు. గురువారం 'పెసా' గ్రామసభల ఎన్నికలు ఎప్పుడు అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే పెసా ఎన్నికలకు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పెసా గ్రామసభలు నిర్వహించడానికి ప్రదేశాలను ఎంపిడిఒ నిర్ధారించనున్నట్లు తెలిపారు. వచ్చే జనవరి మూడోతేదీన ఎన్నికలు నిర్వహించే అధికారులకు ప్రత్యేక శిక్షణ కెఆర్‌పురం ఐటిడిఎలో ఇస్తారు. జనవరి ఒకటి నుంచి ఐదో తేదీ వరకూ 175 పెసా గ్రామసభ (గ్రామాలు, వాటికి అనుసంధానంగా ఉన్న గ్రామాల్లో) ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నిక గురించి టాంటాం వేయనున్నారు. జనవరి ఏడో తేదీ నుంచి పదో తేదీ వరకూ 175 పెసా గ్రామసభ గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జెసి తెలిపారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



ఏలూరు అర్బన్ : నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కరెంటు ఛార్జీల పెంపు, ట్రూఅప్ ఛార్జీల బాదుడు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పడమర వీధిలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, నాయకులు వైఎస్.కనకారావు మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలపై రూ.17 వేల కోట్లు ట్రూఅప్ ఛార్జీల పేరిట ప్రజలపై మోపడాన్ని ఖండించారు. తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లను నిలిపివేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఆరు నెల్లలోనే ప్రజలపై భారాలను మోపుతున్నారని విమర్శించారు. అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమెరికా న్యాయస్థానాలు బయటపెట్టినా, జగన్ రూ.1700 కోట్లు అవినీతికి పాల్పడినట్లు బయటపడినా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నోరు విప్పడం లేదని ఆక్షేపించారు. అదానీతో ఒప్పందాలను ఎందుకు రద్దు చేయడం లేదని, అవినీతి కుంభకోణాలపై ఎందుకు విచారణ జరపడం లేదో రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలను బేషరతుగా రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన, పోరాటాలతో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జె.గోపీ, గగినంటి కోటేశ్వరరావు, దువ్వాడ దుర్యోధన, సిహెచ్.అన్నవరం, మందారు శ్రీనివాసరావు, జంగం చంద్రశేఖర్, చెన్నారి రమేష్, రామరాజు, ఆర్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ గురువారం మండలంలోని వంకవారిగూడెంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి, విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కారం బోడమ్మ, మొడియం లక్ష్మి, కోర్స జయమ్మ, పాముల అప్పారావు పాల్గొన్నారు.

బాలింతలు బెంబేలు..!

సర్వజన ఆసుపత్రిలో సిజేరియన్ బాలింతలకు రెండు, మూడుసార్లు కుట్లు
ఇన్‌ఫెక్షన్ సోకిందని 15 నుంచి 30 రోజుల వరకూ ఆసుపత్రిలోనే
ప్రశ్నిస్తున్న కుటుంబ సభ్యులపై వైద్యుల దురుసు ప్రవర్తన
ఆసుపత్రిని పూర్తిగా గాలికొదిలేసిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సర్వజన ఆసుపత్రిలోని ఎంసిహెచ్ (మదర్ అండ్ ఛైల్డ్ హెల్త్‌కేర్) బ్లాక్‌లో ప్రసవం చేసుకున్న బాలింతలు అక్కడి పరిస్థితులను చూసి బెంబేలెత్తిపోతున్నారు. నిబంధనల ప్రకారం ప్రసవం జరిగిన ఎనిమిది రోజులకు డిశ్చార్జి కావాల్సిన బాలింతలు 15 రోజులు, నెల రోజులైనా ఆసుపత్రిలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్‌ఫెక్షన్ సోకిందంటూ ఆపరేషన్ చేయించుకున్న బాలింతలకు పదేపదే కుట్లు వేస్తూ నరకం చూపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఆసుపత్రిగా ఉండగా గర్భిణుల ప్రసవాల విషయంలో ఎనలేని కీర్తిగడించిన సంగతి తెలిసిందే. బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి అధ్వానంగా తయారైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గర్భిణులకు, శిశువులకు ప్రత్యేక వైద్యం అందించేందుకుగాను చాలా ఏళ్ల క్రితం జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఎంసిహెచ్ బ్లాక్ నిర్మించారు. ఎన్నో పేద కుటుంబాలకు చెందిన మహిళలు ఇక్కడ ప్రసవాలు చేసుకుని ఆరోగ్యంగా తిరిగివెళ్లిన పరిస్థితి ఉండేది. ఎంసిహెచ్ బ్లాక్‌లో దాదాపు వంద బెడ్స్ వరకూ ఉన్నాయి. ప్రతిరోజూ కనీసంగా 150 నుంచి 200 మంది వరకూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులు ఇక్కడ ఓపి సేవలు పొందుతున్నారు. వైద్యులు సరిపడా లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి అధ్వానంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిరోజూ ఆరోగ్యశ్రీలో పది మందికిపైగా గర్భిణులకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఆరోగ్యశ్రీలో ప్రసవం జరిగిన బాలింతలను నిబంధనల ప్రకారం ఎనిమిది రోజులకు డిశ్చార్జి చేసి పంపించాలి. చాలా కేసుల్లో అటువంటి పరిస్థితి లేకుండాపోయిందని బాలింతల కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. ఆపరేషన్ ద్వారా ప్రసవం జరిగిన బాలింతలకు కుట్లు వేస్తారు. ఎనిమిది రోజులకు కుట్లు తగ్గిపోవడం, వాటిని విప్పేసి బాలింతలను పంపించడం జరగాలి. ఇక్కడ అందుకు భిన్నంగా జరుగుతోంది. చాలామంది బాలింతలకు రెండు, మూడుసార్లు కుట్లు వేస్తున్నారు. అదేమని అడిగితే ఇన్‌ఫెక్షన్ అయ్యిందని చెబుతున్నారు. ట్రెయినీ డాక్టర్లతో కుట్లు వేయిస్తున్నారని, అందుకే ఈ విధంగా జరుగుతుందని బాలింతల బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా చాలామంది బాలింతలు 15, నెల రోజులు ఆసుపత్రిలో ఉన్న పరిస్థితి ఉంది.

డాక్టర్లను నిలదీసిన బాలింతల కుటుంబసభ్యులు

పదేపదే కుట్లు పేరుతో బాలింతలకు నరకం చూపించడంతో గురువారం బాలింతల కుటుంబ సభ్యులు అక్కడి వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. దీంతో డాక్టర్లు చాలా దురుసుగా సమాధానం చెప్పడంతో బాలింతల కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. 'మీ ఇష్టం వచ్చినచోట చెప్పుకోండి.. మీరు గొడవ చేస్తే బర్త్ సర్టిఫికెట్ ఇవ్వకుండా చేస్తాం. మీరేమైనా డబ్బులిస్తున్నారా.. ఉచితంగానే కదా చేయించుకుంటున్నారు' అంటూ వైద్యులు ఎదురు దాడి చేశారని బాలింతల కుటుంబ సభ్యులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఆరోగ్యమిత్రల దృష్టికి సైతం బాలింత కుటుంబసభ్యులు సమస్యను తీసుకెళ్లారు. సూపరింటెండెంట్‌ను కలిసేందుకు గురువారం బాలింతల దగ్గర ఉన్న మహిళలంతా వెళ్లగా ఆయన లేకపోవడంతో వెనుదిరిగారు. కొంతమంది తమవారి పరిస్థితి చూసి డిశ్చార్జి చేసేయండి వెళ్లిపోతామని వేడుకుంటున్న పరిస్థితి సైతం ఉంది. బాలింతల వద్ద ఒక వ్యక్తి ఉండటం ఎప్పుడూ జరుగుతోంది. ఇప్పుడు కొత్తగా ఉన్నట్లు 'మీరంతా ఉండబట్టే ఇన్‌ఫెక్షన్ అవుతుందని' అక్కడున్నవారిని తప్పుబడుతుండటం ఆశ్యర్యం కలిగిస్తోంది. గతంలో లేని ఇన్‌ఫెక్షన్ ఇప్పుడు ఎందుకు వస్తుందని ప్రశ్నిస్తే మాత్రం సమాధానం లేదు.

గురువారం పెద్దసంఖ్యలో బాలింతలకు రెండోసారి కుట్లు వేసినట్లు అక్కడి వారు చెబుతున్నారు. బాలింతలను ఇబ్బంది పెట్టడం వల్ల ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకుంటే ఆసుపత్రిని బట్టి రూ.50 వేల నుంచి దాదాపు రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. పేద కుటుంబాలు ఆ భారం తట్టుకోలేక ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తే ఈ విధంగా ఇబ్బంది పెట్టడం ఏమిటని బాలింతల కుటుంబ సభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



సర్వజన ఆసుపత్రిలోని ఎంసిహెచ్ బ్లాక్

సమస్యపై డాక్టర్లతో మాట్లాడిన ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ

బాలింతల సమస్యలను గురువారం ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ సిహెచ్.వంశీకృష్ణ దృష్టికి బాలింత కుటుంబసభ్యులు ఒకరు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎంసిహెచ్ బ్లాక్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా ఈవిధంగా జరుగుతున్నట్లు వైద్యులు సమాధానం చెప్పిన పరిస్థితి ఉంది. సమస్యను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

ప్రసవం జరిగి 12 రోజులైంది.. ఇప్పుడు మళ్లీ కుట్లు వేశారు

బాలిన శ్రీనివాసరావు, బాలింత భర్త, మేదినరావు పాలెం, దెందులూరు మండలం



నా భార్య దీపికను ఈ నెల 13వ తేదీన ఎంసిహెచ్ బ్లాక్‌లో ప్రసవం కోసం చేర్చాను. 14న ఆపరేషన్ చేసి వైద్యులు ప్రసవం చేశారు. బాబు పుట్టాడు. దాదాపు 13 రోజులు గడిచింది. ఇప్పుడు మళ్లీ కుట్లు వేశారు. అదేమని అడిగితే ఇన్‌ఫెక్షన్ అయ్యిందంటున్నారు. అసలు ఎన్ని రోజులకు ఇంటికి పంపుతారో అర్థంకాని పరిస్థితి ఉంది.

రెండోసారి కుట్లు వేయాలంటున్నారు

నక్కా మధుసూదనరావు, బాలింత భర్త, గొల్లగూడెం, ఉంగుటూరు మండలం



నా భార్య అరుణను ఈ నెల 16వ తేదీ రాత్రి సర్వజన ఆసుపత్రిలో ప్రసవం కోసం చేర్చాను. 17న ఆపరేషన్ చేసి ప్రసవం చేశారు. బాబు పుట్టాడు. పది రోజులు గడిచిపోయింది. ఇప్పుడు ఇన్‌ఫెక్షన్ అయ్యిందని చెబుతూ రెండోసారి కుట్లు వేయాలంటున్నారు. అదేమని అడిగితే డాక్టర్లు దురుసుగా మాట్లాడుతున్నారు. ఏం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌ను కలిసి సమస్యను చెప్పాం.

తక్షణమే 12వ పిఆర్‌సి ప్రకటించాలి

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఏలూరులో...

మున్సిపల్ కార్మికులకు తక్షణమే 12వ పిఆర్‌సి ప్రకటించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని, గత సంవత్సరం సమ్మెకాలపు ఒప్పందాల అమలుకు జిఒలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు గురువారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ శానిటరీ సర్కిళ్లలో ధర్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత సంవత్సరం డిసెంబర్ 26 నుండి జనవరి 10వ తేదీ వరకు 16 రోజులు రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహించారని తెలిపారు. సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నేటికీ జిఒలు విడుదల చేయలేదని విమర్శించారు. ప్రధానంగా ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచలేదని, పర్మినెంట్ ఉద్యోగులు, సిబ్బందికి 12వ పిఆర్‌సి ప్రకటించలేదని, మధ్యంతర భృతి ఇవ్వలేదని అన్నారు. సమ్మెకాలపు హామీల అమలు కోసం ఉద్యమం ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వరరావు, పి.విష్ణు, కాళిదాసు, కాంతమ్మ, నాగమణి, సత్యవతి, లక్ష్మి, నాగరాజు, ప్రదీప్, ప్రసాద్ తదితరులు నాయకత్వం వహించారు.

నూజివీడు టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడారు. సమ్మె హామీలను అమలు చేయాలని, అవసరాలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏడుకొండలు, గాంధీ, గంగాధర్, రజిని, రాణి, భవాని, పంగిడిమ్మ, రాధ పాల్గొన్నారు.



నూజివీడులో...

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు స్థానిక మస్తర్ పాయింట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన గురువారం తెల్లవారుజామున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు రేలంగి నాగరాజు, గున్నే లక్ష్మణ్ వెంకటేష్ ప్రసాద్, పెంటయ్య, వేల్పుల రాజు, సత్యవతి, మంగ తదితరులు పాల్గొన్నారు




జంగారెడ్డిగూడెంలో...

భూ సమస్యల పరిష్కారంలో పోలీసుల జోక్యం ఆపాలి

రెవెన్యూ అధికారుల తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఆపాలి
డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ఏజెన్సీ భూసమస్యల పరిష్కారంలో పోలీసుల అనుచిత జోక్యం, రెవెన్యూ అధికారుల తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు సిపిఎం జిల్లా కమిటీ బృందం వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ గిరిజన చట్టాలకు లోబడి రెవెన్యూ శాఖాధికారులు భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు చట్టప్రకారం, న్యాయబద్ధంగా వారికి చెందాల్సిన భూములను గిరిజనేతరులు అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. గిరిజనులు తమ భూముల కోసం, హక్కుల కోసం చేస్తున్న పోరాటాలపై కొందరు పోలీసు అధికారులు గిరిజనేతరులతో కుమ్మక్కై అక్రమ కేసులు బనాయించి, వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్యూల్ చట్టాలకు విరుద్ధంగా ఆర్‌డిఒ, తహశీల్దార్లు విచ్చలవిడిగా గిరిజనేతరులకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇస్తున్నారని విమర్శించారు. బుట్టాయగూడెం మండలంలో ఇనుమూరులో ఎల్‌టిఆర్, 1/70 చట్టం భూములు, ఎడబ్ల్యుడి ప్రభుత్వ భూములను గిరిజనేతరులు అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. ఇనుమూరులో గిరిజనేతరులకు తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లలో గిరిజనులు వేసిన పది ఎకరాల బొబ్బరు పంటను పోలీసుల సహకారంతో దున్నేశారని, దీనివల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరిగిందని చెప్పారు. మర్లగూడెంలో ఆర్‌డిఒ ప్రొటెక్షన్ ఆర్డర్లతో గిరిజనులు వేసిన వరి సాగును దున్నివేయడంతో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులపై మూడు కేసులు నమోదు చేసి కోర్టు చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జైనవారిగూడెంలో తహశీల్దార్ ప్రొటెక్షన్ ఆర్డర్లు ఏకపక్షంగా ఇవ్వడమే కాకుండా గిరిజనులకు అనుకూలంగా ఎస్‌డిసి కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ గిరిజనేతరులకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. చెంచుగూడెంలో గిరిజనులకు అనుకూలంగా పట్టాలు ఉన్నప్పటికీ దడ్డ పూర్ణచంద్రరావు గిరిజనుల భూములను సాగు చేయనీయకుండా అడ్డగిస్తున్న రెవెన్యూ అధికారులు మొద్దునిద్ర పోతున్నారని విమర్శించారు. భూముల విషయంలో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. పాములవారిగూడెం గిరిజనులు వేసుకున్న బొబ్బర పంటను దున్నేశారని, దీనిపై కేసు పెట్టినా పోలీసులు, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. చింతలపూడి, పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ఎత్తిపోతల పథకం కింద ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని కొంతమంది భూకబ్జాదారులు ఆ భూమిని కబ్జా చేశారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన అభివృద్ధి కోర్టు (ఎస్‌డిసి) కెఆర్.పురం ప్రతిరోజు నడిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలంగా గిరిజనులు సాగు చేస్తున్నవారికి పట్టా ఇవ్వాలని, అడంగళ్‌లో వారి పేర్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యల పరిష్కారంలో పోలీసుల అతిజోక్యం అరికట్టాలన్నారు. రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సిపిఎం నేతలు జి.రాజు, ఎన్ఆర్.హనుమాన్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు పట్టణ పరిధిలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు జి.రాజు, ఎన్ఆర్.హనుమాన్లు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడటం దారుణమన్నారు. నేడు భారత అవనిలో బహుజనులు స్వేచ్ఛాయుతంగా జీవిస్తున్నారంటే అది కేవలం రాజ్యాంగంతోనే సాధ్యమైందన్నారు. అంటరానితనం రాజ్యమేలుతున్న రోజుల్లోనే ఎందరో మేధావులు ఉండగా రాజ్యాంగ నిర్మాణానికి అధ్యక్ష స్థానంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు అవకాశం లభించిందంటే ఎంత గొప్పవారో తెలుస్తోందన్నారు. మతతత్వ బిజెపి నేతలు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్చుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో శోభనాద్రి, అబ్బదాసరి వసంతరావు, ప్రసాద్, కేశవరావు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

త్రీఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా అందించాలి

సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి – ముసునూరు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అలసత్వం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముసునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా వ్యవసాయ త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. రబీ సీజన్‌లో పంటలు ఎలా పండించాలని ఆవేదన వ్యక్తం చేశారు. తాము త్రీఫేస్ విద్యుత్ సరఫరా అడిగేది ఈ మూడు నెలల పంట సమయంలోనేనని, ఏడాదిలో మిగతా తొమ్మిది నెలలు ఎలా ఇచ్చినా తాము పట్టించుకోమని చెప్పారు. పంటల సమయంలో ఈ విధంగా సరికాదని ముసునూరు, చింతలవల్లి, సింహాద్రిపురం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమాధానం చెప్పకపోవడంతో రైతులు ఆగ్రహంతో సబ్‌స్టేషన్‌కు తాళాలు వేసి నిరసన తెలిపారు. నేటి నుంచి సక్రమంగానే విద్యుత్ సరఫరా ఇస్తామని మండల, డివిజన్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

ప్రజాశక్తి – చింతలపూడి

గుంతలు లేని రహదారులను ప్రయాణికులకు అందించడమే లక్ష్యమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి, సీతానగరంలో రోడ్ల నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంక్రాంతి పండుగకు ముందుగా గుంతలు లేని రోడ్లను ప్రయాణికులకు అందిస్తామన్నారు. ఎంఎల్ఎగా ప్రజలకు సేవ చేయడం తన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

మండలంలోని దొరమామిడి, లక్ష్మణుడుగూడెం గ్రామాల్లో వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ మొక్కజొన్న పంటను రబీ సీజన్‌లో 3600 ఎకరాల వరకు రైతులు సాగు చేస్తున్నారని, ప్రస్తుతం మొక్కజొన్న మక్కు మొలిచే దశ నుంచి వెన్ను తీసే దశ వరకు ఉన్నట్లు తెలిపారు. అనంతరం రైతులతో కలిసి మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించి, తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మౌనిక, కుసుమ, రైతులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్‌ను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి – మండవల్లి

ప్రయాణికులకు, ప్రజలకు పోలీస్ పరమైన సేవలందించే విధంగా కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కైకలూరు సిఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని లోకుమూడి ఏలూరు రోడ్డు ప్రధాన కూడలిలో ఉన్న కంట్రోల్ రూమ్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పురస్కరించుకుని కైకలూరు, గుడివాడ వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా కంట్రోల్ రూమ్‌ను సత్వరమే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిత్యం సిబ్బంది నియమించి లైట్లు తీసుకోవాలని పేర్కొన్నారు. హైవే ట్రాఫిక్ డయల్ 100పై ప్రజలకు అవగాహన పెంపొందించేలా ఫ్లెక్స్ బ్యానర్లను విధిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి – ముదినేపల్లి

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహశీల్దార్ జెవిఎస్.సుభాని అన్నారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు, రైతుల నుంచి వచ్చిన అర్జీలను తీసుకున్నామని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని, ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో రైతుల నుంచి 15 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్, విఆర్ఒ, కారే శేశ్ పాల్గొన్నారు.

నరసాపురం : రెవెన్యూ సదస్సు ద్వారా అందిన భూసమస్యలన్నీ రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగపాడులో గురువారం గ్రామ రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు భూ సమస్యల పరిష్కారం కోరుతూ 65 మంది రైతులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సుల రైతులు, భూ యజమానులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జలపాలు, రీసర్వే డిటి ప్రవలి, హరిబాబు పాల్గొన్నారు.

ముసునూరు : గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణరాజు అన్నారు. మండలంలోని చింతలవల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.


ఆయుష్ ఆసుపత్రి వైద్యులు తొలగించిన పది కిలోల గడ్డ

అండాశయం నుంచి 10 కిలోల గడ్డ తొలగింపు

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

మహిళా అండాశయం నుంచి పది కిలోల గడ్డను తొలగించినట్లు ఆయుష్ హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ కోగంటి రమ్య తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ ఏలూరు నగరానికి చెందిన 54 ఏళ్ల మహిళ కడుపు ఉబ్బరం, మలబద్ధకంతో ఆయుష్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేరినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు చేసిన అనంతరం మహిళ అండాశయంలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేసి పది కిలోల గడ్డను సురక్షితంగా తొలగించినట్లు తెలిపారు.

నేరాలు – ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

టి.నరసాపురం : అడవి పందుల వేట కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొల్లివారిగూడెం గ్రామానికి చెందిన యతిరాజు ముత్తయ్య (34), భార్య చుక్కమ్మలు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన ముత్తయ్య గ్రామానికి దగ్గరలో ఉన్న అడవికి ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో అడవి పందుల వేట నిమిత్తం కరెంట్ తీగలు మార్చడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందినట్లు భార్య చుక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పల్లె పండగ ద్వారా 983 సీసీ రోడ్లు నిర్మాణం

సంక్రాంతికల్లా పూర్తి
కలెక్టర్ కె.వెట్రిసెల్వి,

ప్రజాశక్తి – కామవరపుకోట రూరల్

జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మొదట విడతగా 983 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.92.02 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, స్థానిక ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కామవరపుకోటలో రూ.70 లక్షలతో, ఆసన్నగూడెంలో రూ.60 లక్షలు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. ఈ రెండు గ్రామాల్లో ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 983 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.92.02 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. వీటిలో చింతలపూడి నియోజకవర్గానికి 187 రోడ్ల పనులకు రూ.19.03 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పురోగతిలో ఉన్న పనులు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో రూ.2.50 కోట్లతో


రోడ్డు ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎ రోషన్‌కుమార్


నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించినట్లు తెలిపారు. రెండో విడతలో డ్రెయినేజీలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం గ్రామాల్లో రహదారులు సమస్య లేకుండా పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రోడ్డు నిర్మాణం కార్యక్రమం చేపట్టిందని, సంక్రాంతికి జిల్లాలో మంజూరు చేసిన సీసీ రోడ్లను పూర్తి చేస్తామని వెల్లడించారు. సంక్రాంతి కల్లా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో పల్లె పండుగ ద్వారా మంజూరు చేసిన సీసీ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయించిన ఎంఎల్ఎను, గ్రామ ప్రజా ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గ వెనుకబడిన ప్రాంతమైనందున జిల్లా కలెక్టర్ చొరవ చూపి రహదారి నిర్మాణానికి ఎక్కువ పనులు మంజూరు చేయించినందుకు కలెక్టర్ వారికి ప్రజల తరఫున అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు. నియోజవర్గంలో మూడు వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, ఆర్అండ్‌బి రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరు చేశారని, వాటికి టెండర్లు పిలుస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు చేశారని, ఎంపీ నిధుల నుంచి ఒక కోటి రూపాయలు శాంక్షన్ ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టగలిగామని చెప్పారు. అనంతరం ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పోలసిగూడెంలో రూ.70 లక్షలు, ఎర్రగుంటపల్లిలో రూ.30 లక్షలు, సీతానగరంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, పంచాయతీరాజ్ ఎస్ఇ రమణమూర్తి, డ్వామా పీడీ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ త్రినాథ్‌బాబు, తహశీల్దార్ జోసఫ్, ఎంపిడిఒలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనస్సులో బడేటి బుజ్జికి సుస్థిర స్థానం

కాంస్య విగ్రహావిష్కరణలో
రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి,
నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

బడేటి బుజ్జి ఏలూరు నియోజకవర్గానికి అహర్నిశలు కృషి చేసి ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక నరసింహరావుపేటలోని జిల్లా పరిషత్ సెంటర్ వద్ద ఫ్లాష్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏలూరు మాజీ ఎంఎల్ఎ బడేటి వెంకట్రామయ్య (బుజ్జి) కాంస్య విగ్రహాన్ని వారు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కీర్తిశేషులు వంగవీటి మోహన్‌రంగా 36వ వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, నగర్ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తదితరులు పాల్గొనిబడేటి బుజ్జి ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ బడేటి బుజ్జి నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. ఏపని చేపట్టినా పట్టు వదలకుండా పూర్తయ్యేంతవరకు కృషి చేసేవారన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న ఎన్‌టి.రామారావు ఆశయాలకు అనుగుణంగా ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి బడేటి బుజ్జి కృషి చేశారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అనేక పదవులు చేపట్టి బడుగు, బలహీన తరగతుల సంక్షేమానికి కృషి చేసి ఏలూరు ప్రాంత ప్రజల మనస్సులో బడేటి బుజ్జి సుస్థిర స్థానం పొందారన్నారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ బడేటి బుజ్జి వివాదాలకు ఆస్కారం లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని, ఆయన ఆశయాలను, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనపై


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

ఉందన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ బడేటి బుజ్జి పేదల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఏలూరు నియోజకవర్గంలో పలు సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి నేరుగా తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఆర్‌టిసి విజయవాడ రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, వలవల బాబ్జి, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, ఎంఆర్‌డి బలరాం, దాసరి ఆంజనేయులు, పలువురు కార్పొరేటర్లు, బడేటి బుజ్జి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, బడేటి బుజ్జి అభిమానులు, ఫ్లాష్ సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి – పోలవరం

భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవంలో భాగంగా ఉన్నత పాఠశాలలో ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థ వారిచే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 35 మంది పాల్గొన్నారు. టి.సత్యశ్రీ, పి.సాయిహేమని, కె.తన్మయి, జె.మేఘన, పి.ప్రజ్ఞ, బి.రామ్‌వినయ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సబ్ జోన్ లెవెల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎం.హారిక, కె.నాగవినూత్న ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు గురువారం బహుమతులను అందించారు. గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్, పోలవరం సత్యసాయి సేవ సంస్థ సబ్ జోన్ ఇన్‌ఛార్జి అడ్డగర్ల రామచంద్రం విద్యార్థులను అభినందించారు

ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి – చింతలపూడి

అత్యుత్తమ చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని, పోరాటాలే మార్గంగా ఎంచుకుని ఈ దేశ ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తుందని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. సిపిఐ వందో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద సిపిఐ పతాకాన్ని వసంతరావు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఎర్రగుంటపల్లి, కొమ్ముగూడెం, రేచర్ల, పాత చింతలపూడి, గనిజర్ల, ఎండపల్లి, శివాపురం గ్రామాల్లో జెండాల ఆవిష్కరించారు.

కొయ్యలగూడెం : భూమి కోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల విముక్తి కోసం సిపిఐ అనేక పోరాటాలు చేసినట్లు ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు అన్నారు. సిపిఐ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా కొయ్యలగూడెం పట్టణంలో సిపిఐ కార్యాలయం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజు మాట్లాడుతూ మండలంలో అనేక భూ పోరాటాలు చేసి పేదల భూమి పంపిణీ చేసిన ఘనత సిపిఐదే అన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావుకు కొద్దిసేపు మౌనం పాటించారు. ఎర్రంపేట గ్రామంలో సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు సిపిఐ జెండాను ఆవిష్కరించారు. కనకాద్రిపురం గ్రామంలో మహిళ నాయకురాలు ఎల్లిబోయిన లక్ష్మి జెండాను ఆవిష్కరించారు. రాజవరం గ్రామంలో రేల నరసింహారావు జెండాను ఆవిష్కరించారు.

నైపుణ్యం వెలికి తీసేందుకు క్రీడా పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

యువతలో నైపుణ్యం వెలికి తీసేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఆర్చరీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి పలు రకాల మెగా క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి జనవరి ఎనిమిదో తేదీ ఆయన పుట్టినరోజు వేడుకల సందర్భంగా బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత జూదం, చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని పాడు చేసుకోకుండా క్రీడల వైపు వెళ్లాలని ఆకాంక్షించారు. మానసిక


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరాటం రాంబాబు, కరాటం సాయి, గడ్డమనుగు రవికుమార్, పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ నవీన్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి – చింతలపూడి

ఐఎన్‌టిఎస్ఒ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్)లో భాగంగా లెవెల్ వన్ నుంచి లెవెల్ టుకు స్థానిక చింతలపూడి శ్రీ చైతన్య విద్యార్థులు 325 మంది ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులకు పాఠశాలలో గురువారం అభినందన సభ నిర్వహించి సత్కరించారు. ఈ సందర్భంగా టి.సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి మరింత మెరుగు పెట్టి ఉన్నత ప్రజ్ఞావంతులుగా ఐఎన్‌టిఎస్ఒ ఒక చక్కని కార్యక్రమం అని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన ఒలంపియాడ్ ఇన్‌ఛార్జి టీచర్స్ సునీల్‌ను, నాగమణిని అభినందించారు. విద్యార్థులు మరింత దీక్షతో కృషి చేసి ఫైనల్స్‌కు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం పార్థసారధి, ఆర్ఐ ఉదయభాస్కర్, కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఎఒ రవీంద్ర, డీన్ మధుబాబు, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఝాన్సీ, టీచర్స్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకులను ఉద్యోగంలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

రాష్ట్రంలో వందలాది మంది వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆరోగ్య సహాయకులను ఉద్యోగం నుంచి తొలగించి 20 రోజులు దాటిపోయినా ఈ విషయమై ప్రభుత్వం నుంచి నేటికీ స్పష్టమైన ప్రకటన రాలేదని కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిగా ఉద్యోగుల తొలగింపు విషయాన్ని ద్వారకాతిరుమల చినవెంకన్నకు చెప్పుకున్నారు. అనంతరం ఉద్యోగుల సంఘం నేత ప్రసాద్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కోర్టు తీర్పు పేరుతో ఒక్కసారిగా ఉద్యోగాల నుంచి తొలగించడంతో ఆరోగ్య సహాయకుల కుటుంబాలు అనాథలై దిక్కులేని పరిస్థితుల్లో రోడ్డున పడిపోయాయన్నారు. మెరిట్ ఆధారంగా చేసి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలన్నా కోర్టు ఉత్తర్వులను సైతం పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. శాంక్షన్ పోస్టులన్నీ మెరిట్ ఆధారంగా పునర్నియామకం త్వరితగతిన చేపట్టాలని, దీని ద్వారా నష్టనివారణకు అవకాశంతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న ఎక్కువ మంది తిరిగి ఉద్యోగాలు పొందే వెసులుబాటు కలుగుతుందని చెప్పారు.

వంగవీటి మోహన్‌రంగాకు ఘన నివాళులు

ప్రజాశక్తి – చాట్రాయి

మంచి వ్యక్తులు మరణించిన కూడా జీవించి ఉన్న కాలంలో చేసిన మంచి పనులు, ఉద్యమాలు ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చాట్రాయి సెంటర్‌లో వంగవీటి మోహనరంగా వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగవీటి మోహన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వంగవీటి రంగా రాధా మిత్రమండలి యువకులు నెల్లూరు రాజేష్, ప్రశాంత్, వెంకట్రావు, సత్యనారాయణ, రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి వేడుకలను నూజివీడులో ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో మోహనరంగా అభిమానులు, కాపు సంఘం నాయకులు నూజివీడులోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, గొడుగువారిగూడెంలో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్ ఆధ్వర్యంలో రంగా అభిమానులు వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూజివీడు ప్రభుత్వ ఏరియా


మండవల్లిలో....

ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

మండవల్లి : పేద, బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతికి నిరంతర కృషి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి మాజీ ఎంఎల్ఎ, కీర్తిశేషులు వంగవీటి మోహన్‌రంగా అని పలువురు నాయకులు అన్నారు. వంగవీటి మోహన్‌రంగా 36వ వర్ధంతిని పురస్కరించుకుని రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక సెంటర్‌లో ఇటీవల నిర్మించిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విట్టల్‌రావు మాట్లాడుతూ బడుగు బలహీన తరగతులకు అండగా నిలబడి న్యాయం కోసం పోరాడి ప్రాణాలను అర్పించిన వ్యక్తి రంగా అని అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సేవా భావం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం 2500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, అడవి కృష్ణ, చందాన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, చాపరాల దుర్గాప్రసాద్, చిట్టూరి వీరేంద్ర, చల్లగోళ్ల చలపతి, కొల్లి ప్రసాద్, గుడివాడ చిట్టిబాబు, రాధా రంగ మిత్ర మండలి సభ్యులు గుడివాడ బాబి, కొటికలపూడి రమేష్, గుడివాడ బాలాజీ, గుడివాడ మురళి, సుధా పుత్ర విజయకుమార్, నల్ల వెంకటేశ్వరరావు, దూసనపూడి నాంచారయ్య, మీసాల గణేష్, యార్లగడ్డ శంకర్, కొల్లా సాయి, వడ్లనే హరినాథ్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని రంగా విగ్రహానికి అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు చోడి పిండి సుబ్రహ్మణ్యం, మంచాల వెంకయ్యనాయుడు, సర్పంచి ముప్పిడి విజయకుమారి, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలోని సంత మార్కెట్ వద్ద ఉన్న రంగ విగ్రహానికి టిడిపి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొడాలి వినోద్, కోటప్రోలు కృష్ణారావు, వీరంకి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కృషిక యాప్ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి –ముదినేపల్లి

రైతులు కృషిక యాప్ వినియోగించుకోవాలని ఎడిఎ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో కృషిక యాప్ పనితీరుపై రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ టీం సభ్యులు రైతులు బ్యాంకుల నుండి రుణాన్ని పొందటానికి కృషిక యాప్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకుంటే బ్యాంకులకు నేరుగా వెళ్లనవసరం లేకుండా కిసాన్ క్రెడిట్ కార్డ్ పొందేందుకు అవకాశం ఉంటుం, దన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కృషిక యాప్ వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

ముసునూరు : గ్రామస్తులకు నీటి కొరత లేకుండా తాగునీటి సరఫరా చేయటమే తమ లక్ష్యమని అక్కిరెడ్డిగూడెం గ్రామ సర్పంచి పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా సుమారు రూ.ఐదు లక్షల వ్యయంతో బోరు, మోటార్ బిగించి తాగునీటి సదుపాయం కల్పించినట్లు సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ మండల కార్యదర్శి మాగ్రాజు సురేష్ పాల్గొన్నారు.

వీధి దీపాలు అందజేత

ముదినేపల్లి : మండలంలోని పెదగొన్నూరు గ్రామపంచాయతీ సింగరాయపాలెం గ్రోవెల్ యాజమాన్యం 36 వాట్స్ సామర్థ్యం కలిగిన 580 వీధి దీపాలను గురువారం అందించారు. గ్రోవెల్ ప్రాసెసర్స్ హెచ్ఆర్ ప్రతిమ ఆధ్వర్యంలో సినీ నిర్మాత కెఎల్.నారాయణ ఆదేశాల మేరకు వీధి దీపాలను మాజీ సర్పంచి ఎన్.శివప్రసాద్, పెదగొన్నూరు డిసి ఛైర్మన్ జి.సురేష్‌బాబు, గుడివాడ వేణులకు అందించారు.

మహారాజశ్రీ 2వ అదనపు సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) భీమవరం

O.S.No.563/2022

Plaintiff :
The Karur Vysya Bank Ltd.,
represented by its Authorized Officer
And

Defendants :
1.Badraadri Vijaya Lakshmi and another

Address of the Defendants 1&2:
1.Badraadri Vijaya lakshmi, W/o.Sandeep, R/o.D.No.4-1, Main Road, Veeravasaram, W.G.Dist., A.P.
2.Badraadri Sandeep, S/o.Appa rao, Hindu, R/o.D.No.4-1, Main Road, Veeravasaram, W.G.Dist., A.P.

పై నెంబర్ దావాలో ప్రతివాదులైన మీరు కోర్టు సమన్లు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కరించుటచే శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా అమలు పరచుటకు, **ది.30-12-2024** వాయిదా వేసి ఉన్నారు. వాయిదా తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని మీ అడ్వకేట్‌తో గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల పై నెంబర్ దావా గ్రంథంలో మీకు పరోక్షంగా తీర్మానించబడును.

Sivangula Subbarayudu
భీమవరం Advocate, Bhimavaram.
తేది.10.8.2024 Cell:9963285565

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.34/2023

Between:
వాది : తాళ్ళూరి వెంకట సత్యనారాయణ
Vs
ప్రతివాది : నంద్యాల భవాని లక్ష్మి ప్రసాద్, S/o.సూర్యనారాయణ, డోర్‌నెం.1-74/1, లంకలకోడేరు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.

మీ పై ప్రామిసరీ నోటు బకాయి రాబట్టుకునే నిమిత్తం దావా దాఖలు చేయటం జరిగింది. మీకు ఎన్నిపర్యాయములు దావా సమన్లు పంపినా మీరు తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కాబట్టి **ది.6-01-2025న ఉ.10.30 ని॥లకు** మీరు వ్యక్తి గతంగా గాని మీ ప్లీడరు ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. లేనిచో పై దావా మీ పరోక్షముగా తీర్మానించబడును.

డి.సుబ్రహ్మణ్యం
పాలకొల్లు అడ్వకేట్, పాలకొల్లు.
ది.25-12-2024 సెల్: 98491 73674.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జంగారెడ్డిగూడెం వారి కోర్టులో

O.S.No.65/2023

Between:
మాధవరపు రాజు ...వాది
Vs
1.బేతిన వెంకటలక్ష్మి
2.బేతిన సోమరాజు ...ప్రతివాదులు

ప్రతివాదులు :
1.శ్రీమతి బేతిన వెంకట లక్ష్మి, భర్త : సోమరాజు, వయస్సు 52 సం॥లు, డోర్‌నెం.8-181, అశోక్‌నగర్, కొయ్యలగూడెం, ఏలూరు జిల్లా.
2.శ్రీ బేతిన సోమరాజు, తండ్రి శ్రీరామమూర్తి, వయస్సు 55 సం॥లు, వ్యాపారం, డోర్‌నెం.8-181, అశోక్‌నగర్, కొయ్యలగూడెం, ఏలూరు జిల్లా.

పై నంబరు దావాలో 1,2 ప్రతివాదులు అయిన మీకు తెలియచేయునది ఏమనగా : పై నంబరు దావాలో మీపైన వాది గారు దావాలో పరిహారము నిమిత్తం శ్రీకోర్టు వారి యెదుట దావా వేసి ఉన్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం ది.**28-01-2025** తేదీకి వాయిదా వేసినారు. సదరు మెయిన్ దావాలోను మరియు I.A.No.168/2023 పిటిషన్‌లోనూ మీకు యెన్నిసార్లు శ్రీకోర్టు వారి ద్వారా సమన్లు, నోటీసులు పంపించినా మీరు తీసుకోకుండా ఉన్నందున, మీ ఇరువురి హాజరు నిమిత్తం ది.**28-01-2025** తేదీకి శ్రీకోర్టు వారు వాయిదా వేసి ఉన్నారు. కనుక ఆరోజు అనగా ది.**28-01-2025** తేదీన ఉదయం 10-30 ని॥లకు మీరు ఇరువురు పైన తెలిపిన శ్రీకోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ తరపు సమాధానము దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడును. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

P.S.R.K.లక్ష్మణరావు, B.A., B.L.
అడ్వకేటు,
Station:Jangareddigudem జంగారెడ్డిగూడెం.
Date:26-12-2024. సెల్: 9440328779.